APTEL/2008/28200

## ఇక టీజీఎస్ ఆర్టీసీ

హైదరాబాద్, మే 22 : తెలంగాణ ఆర్టీసీ పేరులో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ విషయాలన్ని తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అధికారికంగా ప్రకటించారు. నిన్న మొన్నటి వరకు టీఎస్?ఆర్టీసీ అని ఉన్న పేరును టీజీఎస్?ఆర్టీసీగా మార్చింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సీఎం రేవంత్ పాలనాపగ్గాలు చేపట్టినప్పటి నుంచి అనేక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు. పరిపాలనలో తనదైన మార్క్ చూపిస్తూ దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఈక్రమంలోనే స్కూటర్లు, కార్లు, ఇతర వాహనాలు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి టీఎస్ బదులుగా టీజీ అనే అక్షరాలు కేటాయిస్తున్నారు. వారి వాహనాల నంబర్ ప్లేట్?లలో టీఎస్ బదులుగా టీజీ అని రావడం అప్పట్లో చాలా మందిలో కొత్త చర్చకు దారి తీసింది. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ అయిన ఆర్టీసీ అబ్రివేషన్‌లో టీఎస్ ఆర్టీసీకి బదులు టీజీఎస్?ఆర్టీసీ అని కొత్త పేరును తీసుకువచ్చారు.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## విద్యా చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలి

విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా అడ్మిషన్లు నెరవేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిఆర్ఎస్ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిఎం ఓబులేసు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సిద్దిక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న వాటిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు జిల్లాలో నారాయణ చైతన్య మరికొన్ని కార్పొరేట్ మరియు ఇంటర్నేషనల్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి లక్షల రూపంలో ఫీజులు వసూలు చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలో ఒకటి రెండు బ్రాంచ్లకు పర్మిషన్లు తెచ్చుకొని ఏడు ఎనిమిది బ్రాంచ్ లు నడుపుతున్నారని తెలియజేశారు.. ఒక తరగతికి పాఠశాల పేరుతో ముద్రించిన పుస్తకాలను 10 వేల నుంచి 15 వేల రూపాయల వరకు విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యులు అమ్ముతున్నారని మండిపడ్డారు.


సంపుటి: 16 సంచిక : 23 కరీంనగర్ గురువారం, మే 23, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు


# హీటెక్కుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సమరం..!

హైదరాబాద్, మే 22 : తెలంగాణ రాష్ట్రంలో ఒకవైపు పార్లమెంట్ ఎన్నికల ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తుండగా, మరో ఎన్నికకు సిద్ధమయ్యారు ఓటర్లు. వరంగల్ -ఖమ్మం -నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక హీటెక్కిస్తోంది. ఈ ఉప ఎన్నికను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రచారం హెూరెత్తుతోంది. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్, ఈసారి ఎలాగైనా పాగా వేయాలని కాంగ్రెస్ పట్టుదలతో వ్యవహరిస్తోంది. ఈ ఎన్నికల్లోనూ బలమైన ఓట్లు సాధించాలని భారతీయ జనతా పార్టీ భావిస్తోంది. ప్రచారానికి ఇంకా మూడు రోజులే గడువు ఉండడంతో అభ్యర్థుల తరపున కీలక నేతలు రంగంలోకి దిగారు. వరంగల్ -ఖమ్మం -నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 2021లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. అయితే గతేడాది డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలిచారు. దీంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 52మంది అభ్యర్థులు బరిలో ఉండగా, కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేషరెడ్డి పోటీ చేస్తున్నారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గస్థాయిల్లో పట్టభద్రుల సమావేశాలు నిర్వహించారు. మార్నింగ్ వాక్‌లు, సోషల్ మీడియా, టీవీ ఛానల్లతో పాటు, వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారాన్ని ఉధృతం చేశారు. ప్రచారానికి మూడు రోజులు గడువు మాత్రమే ఉండడంతో అభ్యర్థులతో పాటు వారి తరపున కీలక నేతలు కాంగ్రెస్ తరపున రాష్ట్ర మంత్రులు, బిజెపి తరపున కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరపున కేటీఆర్, హరీష్ రావు ఉమ్మడి జిల్లాల్లో ప్రచారాన్ని ఉదృతం చేశారు. మరోవైపున తెరవెనక తమ బలం, బలగాన్ని ఉపయోగించి పట్టభద్రుల ఓట్లు సాధించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తీన్మార్ మల్లన్న రెండో స్థానంలో నిలిచారు. దీంతో ఈ స్థానంలో ఎలాగైనా కాంగ్రెస్ జెండా ఎగరవేయాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్నను పార్టీ అభ్యర్థిగా బరిలోకి దించింది. తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ఉమ్మడి జిల్లాల మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, సీతక్క తోపాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గస్థాయి పట్టభద్రుల సదస్సులను నిర్వహించారు మేధావి వర్గం, విద్యావంతులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు మల్లన్నను గెలిపించాలని కోరుతున్నారు. ఈ ఎన్నికల్లోనూ



గెలిచి మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలుచుకుని తన ఆధిపత్యాన్ని చాటాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. దీంతో తమ గెలుపు సులభమని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. పట్టభద్రుల నియోజక వర్గం ఏర్పాటైనప్పటినుంచి వరుసగా గెలుస్తూ వచ్చిన బీఆర్ఎస్ ఈ ఎన్నికలోనూ సీటును నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగంలోకి దిగారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కీలక నేతలను ఇన్ చార్జీలుగా పార్టీ అధిష్టానం నియమించింది. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ స్థానం నుంచి రెండు పర్యాయాలు పోటీచేయడంతో ఆయనకున్న విస్తృత సంబంధాలు, అనుభవం ఇక్కడ అభ్యర్థికి దోహదపడుతాయని భావిస్తున్నారు. ఈ సీటును దక్కించుకోవడం ద్వారా ప్రశ్నించే ప్రతిపక్షంగా తాము పనిచేస్తామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటును గెలవాలనే లక్ష్యంతో బీజేపీ అగ్రనేతలు ప్రచార పర్వంలోకి దిగారు. కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ నేత ఈటెల రాజేందర్ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపునకు శ్రమిస్తున్నారు.

# సోనియాతో పాటు కేసీఆర్ కు సన్మానం ?



హైదరాబాద్, మే 22 : మాజీ సీఎం కేసీఆర్ ను ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సన్మానిస్తే ఎలా ఉంటుంది ?. ఉహించుకోవడానికి బాగానే ఉంటుంది కానీ అది సాధ్యమా అంటే.. కేసీఆర్ అంగీకరిస్తే సాధ్యమయ్యే అవకాశాలు ఉంటాయి. తెలంగాణ సాధనలో అత్యంత కీలక వ్యక్తిగా కేసీఆర్ ను గుర్తించి సన్మానించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్రం ఏర్పడిన పదేండ్లకు కాంగ్రెస్ పార్టీకి అవకాశం రావడంతో తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని ఘనంగా సన్మానించాలని ప్రభుత్వం నిర్ణంచింది. వేలాదిమంది ఉద్యమించినా, ప్రధాన ఉద్యమకారుడిగా, తెలంగాణ తెచ్చిన గొప్ప నాయకుడిగా, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాబట్టి సోనియాతోపాటు కేసీఆర్ ను కూడా ఘనంగా సన్మానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం పంపాలని నిర్ణియంచుకున్నట్లుగా తెలుస్తోంది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రేవంత్ సర్కారుకు ప్రభుత్వపరంగా తొలి వేడుక నిర్వహించనున్నారు. ధూమ్ ధామ్ గా వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అవతరణ దినోత్సవాన్ని పరేడ్ గ్రౌండ్ లో పదివేలమందితో ఘనంటా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేయనుంది. జయ జయహే గీతాన్ని కూడా అదే రోజున ఆవిష్కరించనుంది. తెలంగాణ ఉద్యమకారుల్ని గౌరవించేందుకు రేవంత్ సర్కార్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ ఇచ్చింది సోనియానే అన్న భావన కల్పించేందుకు కాంగ్రెస్ సర్కార్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే ప్రయత్నాలు చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. తొలి రెండు, మూడేళ్లు అత్యంత ఘనంగా నిర్వహించారు. తర్వాత సాధారణంగా నిర్వహించారు. ప్రతీ సారి తెలంగాణ అమరవీరుల్ని గౌరవించుకోవడం కామన్ గా వస్తోంది. తెలంగాణ ఇచ్చింది తామేనని చెబుతున్న కాంగ్రెస్ కు వేడుకలు నిర్వహించే అవకాశం తొలి సారి వచ్చింది. అందుకే భారీగా నిర్వహిస్తోంది. అయితే కేసీఆర్ ను బీఆర్ఎస్ నేతలు తెలంగాణ బాపుగా అభివర్ణిస్తారు. అలాంటిది ఆయన కూడా ఓ కారణం అన్నట్లుగా చూపి సన్మానం చేస్తానంటే అంగీకరించే పరిస్థితి ఉండదని.. అలా చేయడం కేసీఆర్ ను అవమానించడమే అన్న అభిప్రాయానికి వచ్చే అవకాశం ఉంది.

# ఖాతాలు మూసి.. నగదు లాగేసుకుంటాయి



లఖ్‌నవూ, మే 22: ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే జనధన్ బ్యాంక్ ఖాతాలు మూసి వేసి అందులోని నగదు లాగేసుకొంటాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని శ్రావస్థిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రభుత్వ హయాంలో పేదవారి కోసం దాదాపు 50 కోట్లకు పైగా జనధన్ యోజన ఖాతాలను ప్రారంభించానని తెలిపారు. ఆ ఖాతాలన్నీ ప్రతిపక్షాలు మూసి వేస్తాయని ప్రధాని మోదీ స్పష్టం చేశాయి. ప్రధానిగా తాను దేశంలో ప్రతీ గ్రామానికి విద్యుత్ సరఫరా తీసుకు వచ్చానన్నారు. అదే ప్రతిపక్షం అధికారంలోకి వస్తే మాత్రం ఆ యా గ్రామాలన్నీ విద్యుత్ కోతల ద్వారా చీకటిలోకి నెట్టేస్తాయని విమర్శించారు. ఇక ప్రతీ ఇంటికి తాను కుళాయి ద్వారా నీళ్లు అందించానని గుర్తు చేశారు. అయితే ఇంటికి దూరంగా నీటి కుళాయిలు ఏర్పాటు చేయ గల నైపుణ్యంలో ప్రతిపక్షాలు పేరు సంపాదించాయని చెప్పారు. ఇక 4 కోట్ల మంది పేద ప్రజలకు కోసం నిర్మించిన ఇళ్లు.. ఎస్పీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాళ్ల ఓటు బ్యాంక్‌కు కట్టబెడతారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేసినా.. దానికి విరుద్ధంగా చేయడం ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల ప్రత్యేకత అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాదిస్తే.. ప్రస్తుతం జైల్లో ఉన్న తీవ్రవాదులందరని.. ప్రధానమంత్రి తన నివాసంలో బిర్యానీ తినేందుకు ఆహ్వానిస్తారన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ర్యాలీలో పాల్గొంటున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌లపై ప్రధాని మోదీ ఈ సందర్భంగా వ్యంగ్య బాణాలు సంధించారు. వీరిద్దరు పాల్గొంటున్న బహిరంగ సభలకు భారీగా జనం తరలివచ్చిన కొన్ని వీడియోలను తాను చూశానని ప్రధాని మోదీ తెలిపారు. ఈ సభలకు హాజరయ్యేందుకు ఈ రెండు పార్టీలు ప్రజలకు నగదు పంచి పెడుతున్నాయని.. అందుకే వారంతా వస్తున్నారని మోదీ విమర్శించారు. ప్రజలకు నగదు ఇవ్వకుండా ర్యాలీలకు తీసుకు రావాలని ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల నేతలకు ప్రధాని మోదీ సూచించారు. అయితే వాళ్ల పరిస్థితి ఇలా ఉంటే.. వారు మీ కోసం ఏం పని చేస్తారంటూ ప్రజలను ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రశ్నించారు.

## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

హైదరాబాద్ మే 22 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. సన్నవడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. దీంతో కిషన్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు. దొడ్డు వడ్లను కొనడానికి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన నష్టమేంటి? అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి.. ఇప్పుడు మాట మార్చి రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో 80శాతం దొడ్డు వడ్లనే పండిస్తారని.. దొడ్డు వడ్లను కొనుగోలు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కేంద్రం అన్ని రకాలుగా రాష్ట్ర రైతులకు అండగా ఉందని చెప్పారు. రబీ కింద 75 లక్షల ధాన్యం సేకరించాలని ఒప్పందం కుదుర్చుకుందన్నారు. డిసెంబర్ 9నే రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి.. ఇప్పుడేమో ఆగస్టు 15లోగా చేస్తామని అంటున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# పూలు, పాలు అమ్మడే కాదు... ఆయన భూకబ్జాలు కూడా చేస్తున్నాడు: మల్లారెడ్డి బాధితులు

హైదరాబాద్: నగర శివార్లలోని కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల గ్రామంలోని సుచిత్ర పరిధిలో సర్వేనంబరు 82, 83లలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఇతరుల మధ్య నెలకొన్న భూ వివాదం తెలిసిందే. అయితే రెండున్నర ఎకరాల భూమి తనదేనంటూ మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డి వాదిస్తున్నారు. అందులో 1.11 ఎకరాల భూమి తమదని మరో 15 మంది చెబుతున్నారు. కాగా నాలుగు రోజుల క్రితం సర్వే నెం.82లోని స్థలంలో మల్లారెడ్డి, ఆయన అల్లుడుకు.. మరో 15మంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక్కొక్కరం 400 గజాల చొప్పున గతంలో భూమిని కొనుగోలు చేశామని, కోర్టు సైతం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని 15మంది పేర్కొంటున్నారు. అయితే ఆ స్థలంపై కోర్టు ఆర్డర్ ఉన్నందున స్థలంలో ఎలాంటి గొడవలు చేయొద్దని ఇరువర్గాలకు పోలీసులు సర్దిచెప్పారు. అయితే మల్లారెడ్డి అనుచరులు తమను భయపెడుతున్నారని పోలీసులకు 15మంది సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ భూముల వివాదం ఇంకా కొనసాగుతోంది. ఈ విషయంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం మల్లారెడ్డి బాధితులు సమావేశం నిర్వహించారు. మరోసారి మల్లారెడ్డిపై బాధితులు సంచలన ఆరోపణలు చేశారు. "పూలు, పాలు అమ్మడే కాదు... మల్లారెడ్డి భూ కబ్జాలు కూడా చేస్తున్నాడు. పేట్ బషీరాబాద్‌లోని 82 సర్వే నంబర్‌లో ఎకరం 29 గుంటల కన్నా.. ఎక్కువ ఉంటే మీకు సారీ చెప్పి రాజకీయాల నుంచి వెళ్లిపోతానని మల్లారెడ్డి చెప్పాడని... కానీ మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. రెవెన్యూశాఖ అధికారులు ఆదివారం చేసిన సర్వేలో 82 సర్వే నంబర్‌లో మల్లారెడ్డికి చెందిన ఎకరం 29 గుంటలతో



పాటు.. మాకు చెందిన 33 గుంటలు అందులో కలిసిపోయింది. మల్లారెడ్డికి చెందిన ఎకరం 29 గుంటలు వదిలేసి.. మా 33 గుంటలను మాకు పొజిషన్ ఇప్పించాలి. మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి ముందే ఈ సర్వే జరిగింది. మల్లారెడ్డి మాట మీద నిలబడాలి" అని బాధితులు పేర్కొన్నారు. "2016లో మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత మా పార్టీషన్ తీసేసి మాపైన కేసు పెట్టించాడు. అప్పుడు పోలీసులను ఆశ్రయిస్తే కోర్టుకు వెళ్లమ్మన్నారు. కోర్టు నుంచి "నాట్ టు ఇంటర్ ఫియర్" అనే ఆర్డర్ తీసుకొచ్చాం. కోర్ట్ ఆర్డర్ ఉన్నా... అప్పట్లో మాకు న్యాయం జరగలేదు.రీసెంట్‌గా మా డాక్యుమెంట్లు, కోర్టు ఆర్డర్ తీసుకొని పోలీస్ స్టేషన్‌కి వెళ్లాం. మాకు సరైన డాక్యుమెంట్లు ఉన్నాయి కాబట్టి మా ల్యాండ్‌లోకి మమ్మల్ని వెళ్లమని పోలీసులు చెప్పారు. దీంతో మా భూమిలోకి వెళ్లి మేము బ్లూ షీట్స్ వేసుకున్నాం. దీంతో మల్లారెడ్డి వచ్చి మాపై దాడులు చేసి పోలీసుల ముందే మేము వేసిన బ్లూ షీట్స్ తొలగించారు. పోలీసుల ముందే మమ్మల్ని చంపేస్తామని మల్లారెడ్డి బెదిరించారు" అని ఆయన బాధితులు సంచలన ఆరోపణలు చేశారు.

# కోల్‌కతా హైకోర్టు సంచలన తీర్పు, ఓబీసీ సర్టిఫికెట్లు రద్దు



కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని మమతా బెనర్జీ ప్రభుత్వానికి కోల్‌కతా హైకోర్టు షాక్ ఇచ్చింది. 2010 తర్వాత జారీ చేసిన అన్ని ఓబీసీ సర్టిఫికెట్లను రద్దు చేస్తూ బుధవారంనాడు సంచలన తీర్పు ప్రకటించింది. 1993లో చేసిన చట్టానికి విరుద్ధంగా పత్రాలు జారీ చేశారని న్యాయమూర్తులు తపబ్రత చక్రవర్తి, రాజశేఖర్ మంతాతో కూడిన హైకోర్టు ధర్మాసనం తమ తీర్పులో స్పష్టం చేసింది. అయితే, తమ ఉత్తర్వుల ప్రభావం ఇప్పటికే ఉద్యోగాలు, పథకాల లబ్ధి పొందిన వారిపై ఎటువంటి ప్రభావం చూపవని తెలిపింది. 2010కి ముందు 66 తరగతులుగా క్లాసిఫై చేసిన ఓబీసీల జోలికి తాము వెళ్లడం లేదని, పిటిషన్‌లో వాటిని సవాలు చేయలేదని ధర్మాసనం పేర్కొంది. కాగా, 2010 తర్వాత అన్ని ఓబీసీ సర్టిఫికెట్లను రద్దు చేస్తూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఈ తీర్పు తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. ఓబీసీ రిజర్వేషన్లు కొనసాగుతాయన్నారు. "హైకోర్టు ఆదేశం అందింది. కానీ మేము దీనిని అంగీకరించం. బీజేపీ వల్ల 26,000 మంది తమ ఉద్యోగాలు కోల్పోతారు. బీజేపీ ఆర్డర్‌ను మేము అంగీకరించే ప్రసక్తి లేదు. ఓబీసీ రిజర్వేషన్లు కొనసాగుతాయి" అని మమతా బెనర్జీ అన్నారు.

## గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేసి నేటికీ బిల్లులు అందక నానా ఇబ్బందులు పడుతున్న సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. గ్రామాలలో అభివృద్ధి అనే ఆకాంక్షతో వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు, వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు మొదలగు అనేక కార్యక్రమాలు విడతల వారీగా చేపట్టి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సర్పంచుల పాత్ర కీలకమని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి మరియు తెలంగాణ సర్పంచ్ల సంఘం జేఏసీ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ అన్నారు. ఎంతో కష్టపడి గ్రామాలను అభివృద్ధి పదంలో తీసుకెళ్లిన సర్పంచుల బిల్లుల చెల్లింపులలో గత మరియు తాజా ప్రభుత్వాలు జాప్యం వహించి సర్పంచులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు.

# బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తాం : హరీశ్‌రావు



సిద్దిపేట : బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉన్న ప్రతి కార్యకర్తకు ఇన్సూరెన్స్ సదుపాయం పార్టీ కల్పించిందని.. ప్రమాదవశాత్తూ ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యులకు అండగా నిలిచేందుకు ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ప్రతి కార్యకర్తలకు అండగా నిలుస్తున్నామని.. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు 48 మందికి రూ.2 లక్షల చొప్పున రూ.96 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉండేందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. పార్టీ సభ్యత్వం పొంది ప్రమాదవశాత్తూ చనిపోయిన ప్రతి కుటుంబానికి పార్టీ పక్షాన ఇన్సూరెన్స్ చేసి రూ.2 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన సుంచనకోట యాదగిరి ఇటీవల ప్రమాదవశాత్తూ నీట మునిగి చనిపోయాడు. వారి కుటుంబానికి మంజూరు అయిన రూ.2 లక్షల చెక్‌ను యాదగిరి భార్య మాధవికి అందజేశారు.

# కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకే "ఆది" దుబాయ్ వెళ్లారు

## బి.సి బిడ్డలు విదేశాలకు వెళ్తే బి.ఆర్.ఎస్ నాయకులు ఓర్వడం లేదు



ఎడారి దేశంలో గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు, వారి స్థితిగతులను తెలుసుకునేందుకు, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపులో భాగస్వామ్యమైన గల్ఫ్ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపెందుకే తమ నాయకులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దుబాయ్ వెళ్ళారని డీసీసీ ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ నాయకుల ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బి.సి బిడ్డలైన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు విదేశాలకు వెళ్తే బి.ఆర్.ఎస్ నాయకులు ఓర్వడం లేదని మండిపడ్డారు. తమ నాయకులు ఎక్కడ ఉన్నా వారి ధ్యాస, శ్వాస నియోజకవర్గాలపైనే ఉంటుందని, నియోజకవర్గాలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అటు అధికారులను, ఇటు పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ ఎల్లప్పుడూ నియోజకవర్గ బాగోగులను పర్యవేక్షిస్తున్నారని గుర్తు చేశారు. మొన్నటికి మొన్న శాత్రజ్ పల్లిలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన శ్రీనివాస్ కుటుంబంతో పాటు నిన్నటికి నిన్న వెంకట్రావుపేట గ్రామంలో ఉపాధిహామీ పనుల్లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి అండగా నిలవాలని, ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అటు అధికారులను, ఇటు పార్టీ శ్రేణులను ఆదేశించిన గొప్ప నాయకులు ఆది శ్రీనివాస్ అని, అలాంటి వ్యక్తిని పట్టుకొని పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో తిరగలేక మొఖం చాటేసుకొని ఉన్న చల్మెడ లక్ష్మీ నరసింహా రావు విమర్శించడం సిగ్గుచేటని, తమ నాయకులను విమర్శించే హక్కు ఆయనకు గాని, వారి నాయకులకు లేదని, గత పదేండ్లతో పాటు, అసెంబ్లీ ఎన్నికల తరువాత నియోజకవర్గానికి దూరంగా ఉంటూ అమావాస్య, పౌర్ణమికి వచ్చి పోతున్న వారు ఎవరో ప్రజలందరికీ తెలుసునని, అలాంటి ప్యారచుట్ నాయకులది తమ నాయకులను విమర్శించే స్థాయి కాదని, నిజంగా నియోజకవర్గాన్ని గాలికి వదిలేసింది ఎవరో అందరికి తెలుసునని అన్నారు. రైతులపై, రైతుల కష్టాలపై పూర్తి అవగాహన కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, గత పదేండ్లలో ఏనాడు రైతు రుణమాఫీ చేయలేని బి.ఆర్.ఎస్ పార్టీ రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రుణమాఫీ చేస్తే, ఆయన స్ఫూర్తితో నేడు ప్రజాపాలనలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు సిద్ధంగా ఉందని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం కొరకు పరితపించే తమ నాయకులపై బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు చేసిన అర్థంపర్థం లేని వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాంపల్లి మాజీ సర్పంచ్ బండ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ బాలరాజ్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు నాగుల నర్సయ్య, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, అంబాటి చందు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ ఓ సి మంజూరు చేపించిన ప్రభుత్వ విప్ అది

వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన కే. పద్మ అనారోగ్య సమస్యల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారికి తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు 85,000/- రూపాయలు మంజూరు చేపించారు..అత్యవసర ఆరోగ్య చికిత్స నిమిత్తం ఎల్ఓసి మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# కాంగ్రెస్ పార్టీవి అన్నీ బోగస్ మాటలే



**హైదరాబాద్ మే** కాంగ్రెస్ పార్టీవి అన్నీ బోగస్ మాటలేనని,ప్రజలను దగా చేయడమే వారికి వెన్నతో పెట్టిన విద్య అని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్వీ సుభాష్ విమర్శించారు.ఎన్నికల ముందు రైతులు ఎంత ధాన్యం పండించినా వరిపంటకు రూ.500 బోనస్ ఇస్తామన్నరు.. ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే దగా చేస్తున్నరు. రాష్ట్రంలో దొడ్డు వడ్లు పండించే మెజార్టీ రైతులకు మొండిచెయ్యి చూపించారు.కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా అకాల వర్షాలపాలు చేసింది అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వమని దుయ్యబట్టారు.కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు పడుతుంటే ఒక్క సమీక్ష సమావేశం నిర్వహించలే.. రైతుల సమస్యలు తెలుసుకోలేప్రతి ఏటా రైతులు, కౌలు రైతులకు రూ.15 వేలు రైతుభరోసా అన్నారు.. ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు అన్నారు.. ఇచ్చింది లేదు.ప్రతి రైతుకు డిసెంబర్ 9నే రూ.2 లక్షల రుణమాఫీ అన్నారు.. ఆగస్టు పేరుతో పంగనామం పెట్టాలని చూస్తున్నరు. నిన్నటి కేబినెట్ మీటింగ్ లో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను (దశాబ్ది ఉత్సవాలు) నిర్వహించేందుకు సోనియా గాంధీని ఆహ్వానిస్తామని ప్రకటించారు.కాంగ్రెస్ నిర్వహించేది దశాబ్ది ఉత్సవాలా..? దశ దిశ లేని కాంగ్రెస్ పార్టీ పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ఉత్సవాలా..? చెప్పాలి.అసలు సోనియా గాంధీ గారిని ఏ హోదాలో ఆహ్వానిస్తున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని సుభాష్ డిమాండ్ చేసారు..సబ్బండ వర్గాల పోరాటంతోనే తెలంగాణ ఉద్యమం సాకారమైంది. కాని, ఉద్యమాన్ని ఎప్పటికప్పుడు తమ ఖాతాలో వేసుకుంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ క్రీడ ఆడుతుంటటం సిగ్గుచేటు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని, దశాబ్ది సంబురాల పేరుతో సుమారు రూ.500కోట్లకు పైగా ప్రజాసొమ్మును వెచ్చించిందన్నారు..గత ప్రభుత్వంలో పేదలకు డబల్‌బుడ్‌రూం ఇళ్లు రాలేదు, పంటలకు గిట్టుబాటు ధర రాలేదు, ఆసరా పింఛన్లు అందలేదు.. దళితబంధు ఇయ్యలేదు.. నిరుద్యోగ భృతి దక్కలేదు.కేసీఆర్ బంగారు తెలంగాణ పేరుతో ప్రజలు బతకలేని తెలంగాణగా మార్చారు.నాడు రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందుల్లో చిక్కుకుంటే.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో పార్టీ ప్రమోషన్లకు ప్రజల సొమ్మును దారిమళ్లించారని ఆరోపించారు..ఇప్పుడు అదే బీఆర్ఎస్ పంథాలో కాంగ్రెస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలంటూ మరో ప్రమోషన్ కు సిద్ధమయ్యారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బిజెపి మొదటి నుంచి మద్దతిస్తూనే వచ్చింది.2009లో బిజెపి అధికారంలోకి వస్తే వందరోజుల్లో తెలంగాణ ఏర్పాటు చేస్తామని అద్వాణీ స్పష్టంగా ప్రకటించారు.2012లో నాటి ఉమ్మడి రాష్ట్రంలో మా పార్టీ అధ్యక్షులు కిషన్ రెడ్డి తెలంగాణ పోరు యాత్రతో ప్రజల్లో చైతన్యం నింపారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద పోరుదీక్ష చేశారు.ముఖ్యంగా 2014లో తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు బిజెపి బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇవ్వడం వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది.

# ఇంత మోసమా కాంగ్రెస్ పై కేటీఆర్ ఫైర్



**హైదరాబాద్, మే:** కాంగ్రెస్ ప్రభుత్వం సన్న రకం వరి పంటకు రూ.500 బోనస్ ప్రకటించడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుబట్టారు. ఎన్నికలకు ముందు వరి పంట మొత్తానికి రూ.500 బోనస్ ఇస్తానని ప్రకటించి.. ఇప్పుడు కేవలం సన్నాలకే దాన్ని పరిమితం చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నయవంచనకు గురి చేసిందని.. వారికి కౌంట్ డౌన్ రైతుల నుంచే మొదలవుతుందని అన్నారు."గ్యారెంటీ కార్డులో "వరిపంటకు" రూ.500 బోనస్ అని ప్రకటించి.. ఇప్పుడు "సన్న వడ్లకు మాత్రమే" అని సన్నాయి నొక్కులు నొక్కుతారా?? ప్రచారంలో ప్రతి గింజకు అని ఊదరగొట్టి.. ప్రభుత్వంలోకి రాగానే చేతులెత్తేస్తారా?? ఇది ప్రజా పాలన కాదు.. రైతు వ్యతిరేక పాలన. నిన్నటిదాకా సాగునీరు ఇవ్వక సావగొట్టారు.. కరెంట్ కోతలతో పంటలను ఎండగొట్టారు.. కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా అకాల వర్షాలపాలు చేసి ఆగం చేశారు.. ప్రతి ఏటా రైతులు, కౌలు రైతులకు రూ.15 వేలు రైతు భరోసా అన్నారు.. ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు రూ.12000 వేలు అన్నారు.. వేయలేదు. ప్రతి రైతుకు డిసెంబర్ 9నే.. రెండు లక్షల రుణమాఫీ అన్నారు.. చేయలేదు. నేడు బోనస్ విషయంలో కూడా ప్రభుత్వ బోగస్ విధానాన్ని బయటపెట్టారు. ఓట్ల నాడు ఒకమాట.. నాట్ల నాడు మరోమాట చెప్పడమే కాంగ్రెస్ నైజం. అసెంబ్లీ ఎన్నికల్లో గాలిమాటలతో గారడీ చేసింది.. కాంగ్రెస్ పార్టీ. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు డబ్బాలో పడగానే.. నాలుగు కోట్ల ప్రజల సాక్షిగా తన నిజస్వరూపాన్ని బయటపెట్టింది.. కాంగ్రెస్ సర్కారు. ఎద్దేడ్సిన యవుసం.. రైతేడ్చిన రాజ్యం నిలబడదు.. నమ్మి ఓటేసినందుకు.. రైతుల గొంతు కోసిన కాంగ్రెస్ సర్కారును అన్నదాతలు ఇక వదిలిపెట్టరు.. పల్లె పల్లెనా ప్రశ్నిస్తారు.. తెలంగాణ వ్యాప్తంగా నిలదీస్తారు.. కపట కాంగ్రెస్ పై సమరశంఖం పూరిస్తారు.. నేటి నుంచి రైతన్నల చేతిలోనే.. కాంగ్రెస్ సర్కారుకు కౌంట్ డౌన్ షురూ.. " అని కేటీఆర్ ఎక్స్ లో పోస్ట్ చేశారు.

# జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బందీగా

## నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




పెద్దపల్లి, మే -22: జూన్ 9న నిర్వహించు గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి జూన్ 9న ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించు గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పరీక్ష నిర్వహణ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను ముందుగానే అంచనా వేసి వాటిని పరిష్కరించాలని, జిల్లాలో జూన్ 9న జరుగనున్న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష పకడ్బందీ నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న 6098 మంది అభ్యర్థుల కోసం 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, పరీక్షా కేంద్రాలలో సంబంధిత అభ్యర్థులకు సరిపడ అవసరమైన మేర వసతులు కల్పించాలని, ఫర్నిచర్, టాయిలెట్స్, త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చూడాలని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష ప్రశ్నా పత్రాలు రెండు సెట్లు పరీక్షకు 2 రోజుల ముందు జిల్లాకు వస్తాయని, వాటిని వేర్వేరుగా పోలీస్ స్టేషన్ లోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచాలని, పరీక్ష నాడు ఉదయం ప్రశ్నాపత్రం సెట్ నిర్ణయించడం జరుగుతుందని, అప్పుడు రూట్ అధికారులు పోలీస్ బందోబస్తుతో ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించాల్సి ఉ ంటుందని కలెక్టర్ తెలిపారు. పరీక్షల కంటే ఒకరోజు ముందు రూట్ అధికారులు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు, పోలీస్ అధికారులు సంయుక్తంగా ప్రశ్నాపత్రాల తరలింపు రూట్ లను తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఓఎంఆర్ షీట్ పై ముందుగానే అభ్యర్థి వివరాలు ప్రింట్ అయి వస్తాయని, వాటిని సంబంధిత అభ్యర్థులకే అందించేలా చూడాలని అన్నారు. పరీక్షా కేంద్రం ప్రాంగణంలో, అదే విధంగా భవనం వద్ద ప్రతి 100 మంది అభ్యర్థులకు ఒక్కరు చొప్పున ఐడెంటిటీ అధికారులను నియమించాలని, ప్రతి అభ్యర్థిని పూర్తి స్థాయిలో చెక్ చేయాలని, మహిళలను పరిశీలించేందుకు మహిళా సిబ్బంది, ప్రత్యేక కంపార్ట్మెంట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. హాల్ టికెట్ పై ఫోటో సరిగ్గా లేకపోతే గెజిటెడ్ అధికారి లేదా అభ్యర్థి పూర్వపు విద్యాసంస్థచే ధ్రువీకరించిన లేటెస్ట్ ఫోటో అతికించి, 3 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రం ప్రాంగణంలోకి సెల్ ఫోన్ అనుమతి ఉండదని, అభ్యర్థులు ఎవరు సెల్ ఫోన్ తీసుకుని రావడానికి వీలులేదని , ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి సైతం సెల్ ఫోన్ అనుమతి ఉండదని, ప్రతి పరీక్షా కేంద్రం ప్రాంగణంలో సెల్ ఫోన్ డిపాజిట్ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి, పరీక్ష నిర్వహణ సిబ్బంది, అభ్యర్థుల ఫోన్ లు భద్రపరచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకునేందుకు వీలుగా అవసరమైన మేర ఏర్పాట్లు చేయాలని సూచించారు. బయో మెట్రిక్ అటెండెన్స్ కోసం ప్రత్యేక ఇన్విజిలేటర్ లను నియమించాలని, ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఒక రోజు ముందుగా వెళ్లి పరీక్షా కేంద్రాన్ని ధృవీకరించుకోవాలని, బయోమెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా 9 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, ఎట్టి పరిస్థతుల్లో 10 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డు తో పాటు గుర్తింపు కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ తీసుకొని రావాలని తెలిపారు.



# అంగరంగ వైభవంగా శ్రీ భూనిలా సహిత శ్రీ లక్ష్మి నరసింహస్వామి కళ్యాణం

కన్య దాతలుగా రాచకొండ రామ చార్యులు సంధ్య రాణి రాజన్న ఆలయ స్థాన చార్యులు అప్పల బీమా శంకర్ ఆధ్వర్యంలో అర్చకులు విజయసింహ చారి రామకృష్ణ చారి హర్షవర్ధన చారి రాజన్న ఆధ్వర్యంలో వేద మంత్రాలతో కళ్యాణతంతు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, ఈఈ రాజేష్, డిఈ రఘునందన్ సుపరిడెంట్లు సిరిగిరి శ్రీ రాములు,అల్లె శంకర్, నాంపల్లి గుట్ట ఆలయ ఇన్చార్జి నరేందర్ ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు. కళ్యాణ వేడుకల్లో సుమారు 1500 పైగా భక్తులు పాల్గొనగా కళ్యాణ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# జూన్ 2 నుంచి మోత మోగనున్న టోల్ గేట్ ఛార్జీలు



హైదరాబాద్: మే 22 : తెలంగాణ నుండి ఫోకస్ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ టోల్‌ప్లాజాల వద్ద టోల్ రుసుములు జూన్ 2 నుంచి పెరగను న్నాయి. ఏటా ఏప్రిల్ 2న ఈ ఛార్జీల ను పెంచుతారు. అయితే ఎన్నికల దృష్ట్యా ఈ పెంపు ను వాయిదా వేయాలని ఎన్‌హెచ్ఏఐని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికలు ముగియడంతో జూన్ 2 నుంచి టోల్ ఛార్జీలను సగటున 5శాతం పెంచి వసూలు చేయను న్నారు.

# ప్రస్తుతం మారనున్న రేషన్ కార్డు



హైదరాబాద్ మే 22 : తెలంగాణ నుండి ఫోకస్ ప్రస్తుతం ఉన్న రేషన్ (ఆహార భద్రత) కార్డుల రూపం మారనుంది. వీటి స్థానంలో కొత్తవి జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఈ కసరత్తు మొదలుకానున్నట్లు సమాచారం. ఆరోగ్యశ్రీ కార్డులతో గతంలో ఉన్న రూ.5 లక్షల చికిత్స పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాత ఆరోగ్యశ్రీ కార్డుల స్థానంలో కొత్తవి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా 89,98,546 ఆహార భద్రత కార్డులున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ కార్డు ఓ చిన్న పుస్తకం మాదిరి ఉండేది. అందులో కుటుంబ యజమాని ఫొటోతో పాటు కుటుంబ సభ్యుల పేర్లు, వయసు వివరాలు ఉండేవి. ఆ తర్వాత వీటిస్థానంలో రైతుబంధు పాస్‌బుక్ సైజ్‌లో రేషన్‌కార్డులు జారీ అయ్యాయి. ముందువైపు కుటుంబ సభ్యుల గ్రూప్ ఫొటో, కింద కుటుంబ సభ్యుల వివరాలు.. వెనుకవైపు చిరునామా, ఇతర వివరాలు ఉండేవి. ఆ తర్వాత రేషన్‌కార్డుల స్థానంలో ఆహార భద్రత కార్డులు వచ్చాయి. ఒక పేజీతో ఒకవైపే ఉండే ఈ కార్డులో యజమాని, కుటుంబ సభ్యుల ఫొటోల్లేకుండా.. కార్డుదారు, కుటుంబ సభ్యులు, రేషన్ దుకాణం, కార్డు సంఖ్యహా మాత్రమే ఉన్నాయి.

# వేములవాడ ఇంచార్జ్ ఎంఈఓ గా దూస రఘుపతి

వేములవాడ మే 22 తెలంగాణనుండి ఫోకస్ : వేములవాడ అర్బన్, రూరల్, ముస్తాబాద్, ఇల్లంతకుంట, గంభీరావుపేట్ మండలాల ఇంచార్జ్ ఎంఈఓ (మండల విద్యాధికారి) గా దూస రఘుపతిని నియమిస్తూ బుధవారం జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో వేములవాడ అర్బన్, రూరల్, ముస్తాబాద్, ఇల్లంతకుంట, గంభీరావుపేట్ మండలాల విద్యాధికారిగా పని చేసిన బన్నాజీ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందున సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆయన విధులు నిర్వహించిన మండలాలకు ఇంచార్జ్ ఎంఈఓగా, సిరిసిల్ల ఎంఈఓ దూస రఘుపతిని నియమించారు.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.